## షో

"ఈ పురుషాధిక్య సమాజంలో స్త్రీ నానాటికీ స్వాతంత్ర్యాన్ని కోల్పోతోంది!"

"ఊ..."

"బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కుమారుడంటూ స్త్రీలను బలహీన మనస్కులను చేసి మగాడిపై ఎప్పటికీ ఆధారపడేలా చేసిందీ సంఘం"

"నిజమే"

"స్త్రీలను వంటింటి కుందేలుగానో లేక పడకింటి సుఖం నిచ్చే మరబొమ్మలాగో మగాడు చూస్తున్నాడు"

"అలాగా"

"అక్షరజ్ఞానం లేనివాడు కూడా లక్షల కట్నం అడుగుతుంటే స్త్రీ నోరు మూసుక్కూర్చోవల్సిందేనా?"

"అబ్బెబ్బే..."

"ఆడది అబల కాదని ఆదిశక్తి స్వరూపిణి అని, ఈ దురహంకార పురుష లోకానికి తెలియజెప్పాలి!"

"అబ్బా!"

"ఎన్ని తప్పులు చేసినా మొగుడ్ని దేవుడిగానే చూడాలనే పురాణాల పతివ్రతా కథల్ని నేలమట్టం చేయాలి."

"అవును"

"ఈ సమాజంలో స్త్రీ స్వతంత్రంగా బ్రతకగలదని నిరూపించాలి. అప్పుడుగాని ఈ మగ లోకానికి బుద్ధి రాదు."

"మీ మాటల ద్వారా మాలో ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని కల్గించారు. ఇంతకీ మీ పేరంటమ్మా?"

"నా పేరు లక్ష్మీత్రివిక్రమ్"

— రాజశేఖర్

## ఎవరితో

'ఇది చాలా చిన్ని ఆపరేషన్. చాలా ఈజీగా చేసేయవచ్చు.. మీరేం భయపడకండి అంటున్నార్రా హాస్పిటల్‌లోని వాళ్లందరూ'

'భయమెందుకు మరి చేయించుకో'

'అలా అని నాతో కాదురా నాకు ఆపరేషన్ చేసే డాక్టరుతో అంటున్నారు.'

—కె.వి.మధుసూదనరావు, కాకినాడ.

పీటల మీద దంపతులు కూర్చున్నప్పుడు భార్యను ఎటువైపు కూర్చోపెట్టాలిరా సుబ్బన్నా."

వీరన్న గారి మాటలు ఆ మండువాలో ఖంగున మోగాయి. ఆయన మాటలకి సుబ్బన్న ఖంగుతిని బేల చూపులు చూశాడు. మండువాలో కూర్చున్న జనమంతా వెనక్కి తిరిగి గుమ్మంలో నుంచున్న వీరన్న గారి కేసి చూశారు.

"మాయదారి సుబ్బన్నకి కుడి ఎడమ తెలియదు. నువ్వటు కూసో" అన్నాడు పీటల మీద కూర్చున్న యజమాని భార్యతో. ఆమె భర్తకి ఎడం వైపుకి వెళ్లి కూర్చుంది.

సుబ్బన్న తను కూర్చున్న పీట ఖాళీ చేసి పక్కనే నేల మీద చతికిలబడి వీరన్నగారి కేసి భయం భయంగా చూస్తున్నాడు.

"మా రోజుల్లో నమకం, చమకం, ఉపనయనం, వివాహం—అన్నీ కళ్ళు మూసుకుని చెప్పచెప్పే తాహతు ఉంటేగాని పీట ఎక్కేవాళ్ళం కాదు. అలాంటిది ఈ రోజుల్లో తూర్పేదో, పడమరేదో తెలియని కుంకలు కూడా పసుపు పళ్లెంలో చెయ్యి పెట్టడానికి సాహసిస్తున్నారు. కాలం —కలికాలం. అందుకే బ్రాహ్మణ్యానికి విలువ లేకుండా పోయింది."

సుబ్బన్న ఖాళీ చేసిన పీట మీద చతికిలబడుతూ వీరన్నగారన్న మాటలు అక్కడ చేరిన వాళ్ళంతా ఆయన చెప్పిన దాంట్లో ఆవగింజంత కూడా అబద్ధం లేదన్నట్టుగా తలూపారు.

అవును! సుబ్బన్న మొహం ఆవగింజంత అయిపోయింది. అక్కడ జరుగుతున్నది సత్యనారాయణ వ్రతం. అది సుబ్బన్న ఆశ్రమం. అతనికి వ్రతం చేయించడం చాతకాదు. అందుకే ముందు రోజు వీరన్న గారి దగ్గరికి వెళ్ళి 'మీ రొచ్చి కాస్త మాట దక్కించాలి' అని ప్రాధేయపడ్డాడు.

'ముందు నాకు కుదరదురా!' అన్నాడు.

తర్వాత ఏమిస్తావ్ అనడిగాడు.

మరి కొంత సేపు బతిమాలాక 'సరే — వస్తాను. కాని సుబ్బారావు తండ్రి ఆబ్దీకం ఉంది. కాళ్ళు కడిగి పెట్టేస్తానన్నాడులే — నేనెడితే ఓ ఇరవైరాలుస్తాడు. అది పూర్తి చేసుకుని వస్తాను. నే వచ్చేలోగా దంపతుల్ని పీటల మీద కూర్చోబెట్టి విఘ్నేశ్వర పూజ కానిస్తూ ఉండు" అన్నాడు.

సుబ్బన్న చాలా సంతోషపడ్డాడు.

వీరన్న గారు చెప్పినట్టే ఉదయమే వ్రతం చేసుకునే యజమాని ఇంటికి వెళ్లి పూజా సామగ్రి అంతా సర్ది విఘ్నేశ్వరా పూజ మొదలు పెట్టించాడు.

'శ్రీ మహా గణపతయే నమః వస్త్ర యుగ్మం సమర్పయామి'



అంటున్నాడో లేదో—వీరన్న గారు రావడం, తన తప్పు పట్టుకోవడం, తన సిగ్గు వస్త్రం విప్పెయ్యడం జరిగిపోయింది.

సుబ్బన్న దొరికిపోయాడు.

తిమింగలానికి చేప పిల్ల దొరికి పోయినట్టు ఘోరంగా దొరికిపోయాడు.